# జనరల్ స్టడీస్

## భారత ఆర్థిక సంస్థ సదస్సు - 2017

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడుస్తున్నా కడుపు నిండా తిండి, సరైన ఆవాసం లేని కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులెందరో ఉన్నారు. ఏ దేశమైనా సమగ్రాభివృద్ధి సాధించాలంటే ఆర్థిక ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అందాలి. ఈ నేపథ్యంలోనే భారత్ అభివృద్ధి అనుభవాలను చర్చించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ 100వ వార్షిక సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యమిచ్చింది.

భారత ఆర్థిక సంస్థ ఏటా ఘనంగా నిర్వహిస్తున్న వార్షిక సదస్సు 2017, డిసెంబరు 27 నుంచి 30 వరకు నాలుగు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సదస్సును ప్రారంభించారు.

- ✤ దేశంలో నేటికీ అసంఖ్యాక ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని, వైద్యం – ఆరోగ్యం, విద్య, గృహవసతి, ఇతర పౌర సదుపాయాలు సామాన్య ప్రజలకు దక్కడం లేదని ప్రత్యేకించి సాంప్రదాయకంగా బలహీనవర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన మహిళల విషయంలో ఇది నూటికి నూరుపాళ్లు వాస్తవమని, 2022 నాటికల్లా 'నూతన భారత్' కలలు సాకారమవ్వాలంటే ఈ సమస్యలను పరిష్కరించుకోవాలని రామ్‌నాథ్ కోవింద్ అన్నారు.
- ✤ దేశంలో సహకార సమాఖ్య స్ఫూర్తి వెల్లివిరుస్తున్న తరుణంలో ప్రత్యేకించి 14వ ఆర్థిక సంఘం నివేదికను అమలు పరిచిన తర్వాత రాష్ట్రాలకు మరిన్ని నిధులు కేటాయించడం జరుగుతుందని, దీంతో అభివృద్ధి సాధనలో రాష్ట్రాల బాధ్యత మరింత పెరిగిందని ఆయన అన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు తయారీ రంగంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, సేవల రంగాన్ని విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రాచుర్యం కల్పించడం, కార్మికులు, అట్టడుగు వర్గాలకు సామాజిక భద్రత కల్పించడం తదితర చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థకు నూతనోత్తేజం కల్పించవచ్చని భారత రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పురోగతి, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధి అంశాలపై చర్చించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్లు డా.సి. రంగరాజన్, వై.వి. రెడ్డి, సుఖ్‌దేవ్ తోరట్, బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపకులు మహ్మద్ యూనస్, డా.రాజేంద్ర ప్రసాద్‌లతో పాటు మొత్తం 1300 మంది ఆర్థికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. 2017, డిసెంబరు 30న జరిగిన ముగింపు సమావేశానికి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ హాజరయ్యారు. భారత ఆర్థిక సంస్థ ఏర్పాటయ్యాక ఏటా నిర్వహిస్తున్న సమావేశాల్లో 100వ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

### భారత ఆర్థిక సంస్థ (ఐఈఏ)

దేశంలోని ఆర్థికవేత్తలు సభ్యులుగా ఉన్న ఒక రిజిస్టర్డ్ సంఘం ఇది. 1917లో ఏర్పాటైంది. అర్థశాస్త్రంలోని విధానపరమైన అంశాలపై చర్చించుకునేందుకు ఒక ఉమ్మడి వేదిక అవసరమనే ఉద్దేశంతో భారత ఆర్థిక సంస్థ ఏర్పాటైంది. ఆర్థిక రంగాల్లో, ఆర్థికపరమైన విషయాల్లో నిష్ణాతులతో ఏటా వార్షిక సదస్సు/ సమావేశాలు, ప్రత్యేక సదస్సులు, ఉపన్యాసాలను నిర్వహిస్తోంది. భారత ఆర్థిక సంస్థ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలో ఒక సభ్యదేశం/ సంస్థ. 1986లో ఇది అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో సంయుక్తంగా న్యూదిల్లీలో ప్రపంచ ఆర్థిక కాంగ్రెస్ సదస్సును నిర్వహించింది. ఈ ప్రపంచ సదస్సుకు నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జె.ఆరో అధ్యక్షత వహించారు. భారత ఆర్థిక సంస్థలో ప్రస్తుతం 500 పైగా సంస్థాగత, వ్యక్తిగత సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారు. మొదటి భారత ఆర్థిక సంస్థ వార్షిక సదస్సు 1917లో కలకత్తాలో ప్రొఫెసర్ జె. హామిల్టన్ అధ్యక్షతన జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 9 సార్లు నిర్వహించారు.

- ✤ భారత ఆర్థిక సంస్థ సదస్సు – 2017లో ప్రధానంగా అయిదు అంశాలు/ భావనలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. అవి:

1) అభివృద్ధి గమనం – తీరుతెన్నులు

2) అభివృద్ధి క్రమంలో ద్రవ్య, విత్త సంబంధిత అంశాలు

3) భారత్, బాహ్య ప్రపంచం

4) పంపిణీ సంబంధిత అంశాలు

5) వ్యవసాయం, తయారీ, సేవల రంగం వారీగా పురోగతి.

- 'అభివృద్ధి గమనం – తీరుతెన్నులు' అనే అంశంలో భాగంగా ఏడు దశాబ్దాల భారత అభివృద్ధి – అనుభవాలు, భారతదేశంలో వనరుల వినియోగం, అభివృద్ధి – పర్యావరణ సంబంధిత సమస్యలు, సామాజిక, ఆర్థిక విధానాలు లాంటి విషయాలపై జరిగిన చర్చల్లో పలువురు ఆర్థికవేత్తలు పాల్గొన్నారు. అభివృద్ధి క్రమంలో ద్రవ్య, విత్త సంబంధిత అంశాల్లో భాగంగా – నిరంతర ప్రగతి కోసం ద్రవ్య–విత్త విధానాలు, పర్యవేక్షణ, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య, విత్త విధానాల పాత్ర, ప్రభుత్వ విత్త నిర్వహణ – లోటు, రెవెన్యూ, అప్పులు, అవినీతి, ఆర్థిక నేరాలు, చట్టపరమైన చర్యలు, వస్తుసేవల పన్ను, ప్రత్యక్ష పన్నుల విధానం తదితర విషయాలు చర్చకు వచ్చాయి.
- 'భారత్, బాహ్య ప్రపంచం' అంశానికి సంబంధించి భారత్‌లో విదేశీ వర్తక వాణిజ్యం, దేశీయ వాణిజ్యం, ఆర్థిక నియంత్రణల ఎత్తివేత, సరళీకృత మూలధన ఖాతాలకు సంబంధించిన అంశాలు, భారత్‌లో ప్రాంతీయ, ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత చర్చలు జరిగాయి.
- పంపిణీ సంబంధిత అంశంలో భాగంగా భారత్‌లో ఉపాధి కల్పనను మెరుగుపరచడం – కార్మికుల మార్కెట్, అభివృద్ధిలో పేదరికం – అసమానతలు, సామాజిక అసమానతలు, వెలి, వివక్ష, సామాజిక పరివర్తన, భారత్‌లో వైద్య ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలు చర్చకు వచ్చాయి.
- రంగాల వారీగా సాధించిన పురోగతికి సంబంధించి భారత స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయం, తయారీ, సేవల రంగం వాటా, నిర్మాణాత్మక రూపాంతరీకరణ – వ్యవసాయ, తయారీ, సేవల రంగాల్లో అంతర్గత పరిణామాల నిర్వహణ, రంగాల వారీగా అంతః సంబంధాలు – అభివృద్ధి అవకాశాలు, రంగాల వారీగా ఉత్పాదకతను మెరుగుపరిచే విధానంలోని తీరుతెన్నులు, వలసలు, పట్టణీకరణ – గుణాత్మకమైన పరిణామాలు, రంగాలవారీగా పురోగతి కోసం భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రత్యేక భావనలపై చర్చ జరిగింది.

## సైద్ధాంతిక అవగాహన అవసరం

దేశ ఆర్థిక వ్యవస్థలోని లోపాలను చక్కదిద్దడానికి బహుముఖ ప్రయత్నాలు చేపట్టాలని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. స్వదేశీ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి ఆర్థిక రంగ నిపుణులు, విశ్లేషకులు, విత్తరంగ ప్రముఖులు సంయుక్తంగా మేథోమథనం జరపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సదస్సు అభిప్రాయపడింది. ఆర్థిక రంగాన్ని సిద్ధాంతపరంగా చూసినప్పుడే ఫలితాలు సాధ్యమవుతాయనేది వీరందరి అభిప్రాయాల సారాంశం. 'ఆర్థిక సిద్ధాంతంలో భారతీయ ఆర్థికవేత్తల భాగస్వామ్యం, అనుభవవాద పరిశోధన' అనే అంశంపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభంపై ఆర్థికవేత్తలు యోచించాలని, వ్యవసాయ రంగ అభ్యున్నతికి ప్రముఖ ఆర్థికవేత్త మహలనోబిస్ అనుసరించిన విధానాలకు తిరిగి రూపకల్పన చేయాలని ప్రొ. వై. కె. అలఘ్ అభిప్రాయపడ్డారు. బలహీన ఆర్థిక విధానాలతో ఆర్థిక రంగం కునారిల్లుతోందని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు రెండింటినీ తులనాత్మకంగా పరిశీలించి ఆర్థిక రంగాన్ని అధ్యయనం చేయాలని ప్రొఫెసర్ రొక్కం రాధాకృష్ణమూర్తి అన్నారు. కేంద్రప్రభుత్వ మాజీ ఆర్థిక సలహాదారు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ కౌశిక్ బసు ప్రసంగిస్తూ ఆర్థిక విధానాలనేవి ఎప్పుడూ ఒకేలా స్థిరంగా ఉండకూడదని, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల పోకడలను గమనిస్తూనే నూతన విధానాలను అవలంబించాలని సూచించారు.

## పట్టణీకరణే పెను సవాలు

దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. వ్యవసాయం లాభసాటిగా లేదని ప్రజలు పట్టణాల వైపు మొగ్గు చూపడం రోజురోజుకూ పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాల్లో మౌలిక సదుపాయ కల్పన పెద్ద సమస్యగా మారిందని, దీన్ని అధిగమించకపోతే దిల్లీ తరహాలో కాలుష్యం పెరిగిపోయి, ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త మాంటెక్ సింగ్ అహ్లూవాలియా అన్నారు. జాతీయ ఆర్థిక సంస్థ ముగింపు సమావేశంలో అహ్లూవాలియా కీలకోపన్యాసం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన వ్యవసాయ రంగంలో ప్రస్తుతం సాంకేతికత చొచ్చుకు రావడం, వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తుండటంతో కూలీలకు ఉపాధి కరవై, స్థిరమైన ఆదాయం లేక పట్టణాలకు వలస వస్తున్నారని ఆయన వివరించారు.

- దేశ సంపదగా భావిస్తున్న యువతకు సరైన ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడానికి అన్ని స్థాయుల్లో కృషి జరగాలని సూచించారు. దక్షిణ భారతంతో పోలిస్తే ఉత్తరాది యువత ఉపాధి లేమితో ఖాళీగా ఉంటున్నారు. దేశ తలసరి ఆదాయం

పెరగాలంటే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేయడంతోపాటు ఆర్థిక రంగంలో పరిశోధనలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని అహ్లూవాలియా అభిప్రాయం.

### నిరుద్యోగమే అసలు సమస్య

దేశంలో ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంది. నిరుద్యోగమే ప్రధాన సమస్యగా పరిణమిస్తోంది. లేబర్ బ్యూరో తాజా నివేదిక ప్రకారం వ్యవసాయరంగంలో 8.46 మిలియన్ ఉద్యోగాలు తగ్గాయి. తయారీ, విద్యుత్ ఉత్పాదన, నిర్మాణరంగంలో కూడా 2.8 మిలియన్ ఉద్యోగాలు తగ్గాయి. సేవల రంగంలో కొత్తగా 6.65 మిలియన్ ఉద్యోగాలు కల్పించినా మొత్తం మీద 11.27 మిలియన్ ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవం.

- వృద్ధిరేటును సాధ్యమైనంత త్వరగా 8 శాతానికి చేరేలా కృషి చేయాలి. నిరుద్యోగ సమస్య నుంచి బయటపడాలంటే అత్యధిక శాతం మందికి జీవనాధారమైన వ్యవసాయ రంగం ద్వారా ఉపాధి లభించాలి. ప్రస్తుతం దేశంలో బ్యాంకింగ్ రంగం పరిస్థితి ఏమాత్రం బాగోలేదని అహ్లూవాలియా అభిప్రాయపడ్డారు. బ్యాంకింగ్ రంగాన్ని గాడిలో పెట్టడానికి ఆర్థిక సంస్కరణలు అవసరమని, బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ జోక్యం ఉండరాదని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వం వాటా 50 శాతం కంటే తక్కువగా ఉండటమే శ్రేయస్కరమని, ఈ అంశాలపై సుదీర్ఘకాలంగా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ నరసింహం కమిటీ రెండో నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.
- ఆర్థిక ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అందినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుంది. దేశ ప్రస్తుత వృద్ధిరేటు ఇదే రీతిలో 2030 దాకా కొనసాగితే తలసరి ఆదాయం 1600 డాలర్ల నుంచి 6 వేల డాలర్ల వరకు పెరుగుతుంది. ప్రజల్లో ఆర్థిక అసమానతలను తొలగించడానికి కృషి చేస్తున్న దక్షిణ కొరియా స్ఫూర్తిగా భారత్‌లోనూ ఈ దిశగా కృషి అవసరం.

### ఆరోగ్యమే ప్రధానం

నాలుగు రోజుల ఆర్థిక సదస్సులో భాగంగా 'ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు – ఫలితాలు' అనే అంశంపై జరిపిన అధ్యయన వివరాలను నాగార్జున విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె. మధుబాబు వెల్లడించారు. రాష్ట్రంలో ఆరోగ్య లక్ష్యాల సాధన, సౌకర్యాల కల్పన విషయంలో జిల్లాల మధ్య వ్యత్యాసాలున్నాయి. విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధిక ఆరోగ్య వ్యయంతోపాటు, ఆరోగ్య సౌకర్యాల కల్పన కూడా అధికంగానే ఉంది. మిగిలిన జిల్లాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఆరోగ్యాన్ని పెంపొందింపజేసే రక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య సౌకర్యాలు జిల్లాల్లో మరింత మెరుగుపడాల్సి ఉంది. 2004 – 07, 2010 – 13 మధ్య ఆరోగ్యంపై వ్యయాన్ని చూస్తే 11.1 శాతం నుంచి 9.5 శాతానికి తగ్గింది. రాష్ట్రంలో జిల్లా స్థూల ఉత్పత్తిలో ఆరోగ్య రంగం వాటా 0.42 గా ఉంది. ఇది 2004 – 07 నుంచి 2010 – 13 మధ్య నిలకడగా ఉంది. జిల్లాలవారీగా చూస్తే శ్రీకాకుళం, కడప జిల్లాల్లో డి.డి.పిలో వృద్ధి కనిపించింది. రాష్ట్రంలో సగటు తలసరి ఆరోగ్య వ్యయం పెరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అధికంగా ఉంటే అనంతపురం లాంటి జిల్లాల్లో తక్కువగా ఉన్నాయి. మాతా శిశుమరణాలు, సంతానోత్పత్తి రేటు ప్రకాశం, విజయనగరం, అనంతపురం, శ్రీకాకుళం లాంటి జిల్లాల్లో అధికంగా నమోదయ్యాయి. మధుమేహం, బి.పి. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో అధికంగా ఉన్నాయి. శిశు మరణాల రేటు, సంతాన సాఫల్యతా రేటు రాష్ట్ర సగటు కంటే కర్నూలు జిల్లాలో అధికంగా ఉంది.

"నేటికీ మన అర్థశాస్త్ర విద్యా విధానం మూసధోరణిలోనే సాగుతోంది. సంప్రదాయ, న్యూమోనికల్, ఆధునిక ఆర్థికం అనే మూడు పద్ధతుల్లో విద్యాభ్యాసం జరుగుతున్నా సిద్ధాంతాలను సిద్ధాంతపరంగా అర్థం చేసుకోవడంలో విఫలమవడం వల్లే మన దేశ ఆర్థిక విధానాల్లో స్పష్టత కొరవడింది" **– కౌశిక్ బసు**

"ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. దేశంలోని భిన్నమైన ప్రాంతాలు, వర్గాల్లోని సాంఘిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి ఆవశ్యకమైన విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉంది" **– రామ్‌నాథ్ కోవింద్**

"అమెరికా లాంటి దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటున్నాయి. దీన్ని గుర్తెరిగి దేశ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడానికి, సరికొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడానికి అన్ని దశల్లో ప్రయత్నాలు జరగాలి"

**– వై.కె. అలఘ్**

| తెలుగు రాష్ట్రాలు - ఐఈఏ సదస్సులు | | |
|---|---|---|
| ప్రాంతం | సంవత్సరం | అధ్యక్షుడు |
| 1. హైదరాబాద్ | 1937 | డా. పి. జె. థామస్ |
| 2. హైదరాబాద్ | 1948 | డా. జె. సి. సిన్హా |
| 3. వాల్తేరు | 1949 | ప్రొ. వి. కె. ఆర్. వి. రావు |
| 4. హైదరాబాద్ | 1968 | ప్రొ. జె. కె. మెహతా |
| 5. హైదరాబాద్ | 1997 | డా. డి. ఎస్. అవస్థి |
| 6. విశాఖపట్నం | 2005 | ప్రొ. టి. ఎస్. పపోలా |
| 7. విశాఖపట్నం | 2012 | ప్రొ. బాలచంద్ర మంగేకర్ |
| 8. హైదరాబాద్ | 2015 | ప్రొ. కౌశిక్ బసు |
| 9. తిరుపతి | 2016 | ప్రొ. ఆర్. రాధాకృష్ణ |

**రచయిత: డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net